క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురు, పోరంకి పరిధుల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుద్ శాఖ ఆపరేషన్స్ ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన గురువారం వివరాలు వెల్లడించారు. కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున యనమలకుదురు లాకుల వద్ద నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు, పాతచెక్‌పోస్టు, అయ్యప్పనగర్ రోడ్డు, చౌదరిపేట, బందరు రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పోరంకి సీతాపురంకాలనీ, శ్రీనివాసానగర్ కాలనీ, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. స్థానికులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

వైఎస్సార్ కంటి వెలుగులో 110 మందికి పరీక్షలు



కంకిపాడు: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంతో వృద్ధుల కంటి సంరక్షణ సాధ్యమని పీహెచ్‌సీ డాక్టర్ సుధప్రసూజ అన్నారు. మండలంలోని ఉప్పలూరు ఆరోగ్య ఉపకేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. శిబిరంలో 110 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు జరిపించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ వృద్ధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పేరంటాలమ్మకు శాకంబరీ దేవి అలంకరణ



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవార్లను శాకంబరీదేవిగా అలంకరిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ తెలిపారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఈ అలంకరణ చేస్తున్నామని తెలిపారు. పలు గ్రామాల్లో భక్తులు ఇప్పటికే కూరగాయలు, పండ్లు ఈ అలంకరణ నిమిత్తం అందజేశారన్నారు. అమ్మవార్ల అలంకరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశపరీక్షలో ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ఎంపికైన 80 మంది విద్యార్థులు వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

కంకిపాడు: ఆటో ఢీకొని గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి తెలిపిన కథనం మేరకు.. మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ గ్రామానికి చెందిన డొక్కు నాగమల్లేశ్వరరావు(48) ఈనెల 5వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో విజయవాడ నుంచి బందరు ఆటోలో వెళ్తు మార్గ మధ్యంలో గోసాల సెంటరులో ఆటో ఆపారు. నాగమల్లేశ్వరరావు రోడ్డు దాటే క్రమంలో విజయవాడ నుంచి కంకిపాడు వైపు వెళ్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొనడంతో నాగమల్లేశ్వరరావు తలకు బలమైన గాయమైంది. 108 అంబులెన్సులో వైద్యం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాగమల్లేశ్వరరావు గురువారం మృతి చెందాడు. ఈ మేరకు ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం అందించాయి. నాగమల్లేశ్వరరావు అల్లుడు ప్రేమసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ లక్ష్మీ తెలిపారు.

షిర్డీ సాయి సేవలో పీలేరు ఎమ్మెల్యే

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం బాబాను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అర్చకుడు ఆలయ మర్యాదలతో రామచంద్రారెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం బాబాకు ప్రత్యేక పూజలు విశేషంగా హారతులు ఇచ్చి బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బాబావారిని దర్శించుకోవటం ఆనందంగా ఉందన్నారు. మందిర సేవలను అభినందించారు.

ప్రజలకు మేలు చేసే కార్యక్రమమే 'జగనన్న సురక్ష'

రామవరప్పాడు: ప్రతి పేదవాడికి సంక్షేమం, ప్రభుత్వ పాలనను చేరువ చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు సచివాలయం-1లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి 558 మంది లబ్ధిదారులకు వివిధ రకాలైన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీమోహన్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేక సంక్షేమ పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో సురక్ష సభలు ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వం తరఫున 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణరాజు, జగనన్న సురక్ష మండల ప్రత్యేక అధికారి ఎస్.శైలజ, జగనన్న సురక్ష సచివాలయ ప్రత్యేక అధికారి జాహ్నవిరెడ్డి, లిడ్‌క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ, సర్పంచ్ శీలం రంగారావు, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీ మోహన్

సమస్యలు వెంటనే పరిష్కారం

పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారం చేస్తున్నామని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. పోరంకి సచివాలయం-3లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ప్రకాశరావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం అమలులోకి తీసుకు వచ్చిందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవటానికి వలంటీర్లు ఇళ్లకు వచ్చి సర్వే చేసి సమస్యలు యాప్‌లో నమోదు చేస్తున్నారని చెప్పారు. జగనన్న సురక్షలో 11 రకాల సర్టిఫికెట్లు జారీ చేస్తున్నామన్నారు. టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు తొలగించాలని ప్రభుత్వం జగనన్న సురక్ష అమలు చేస్తోందన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 197 సరిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, అసిస్టెంట్ కమిషనర్ అభినేష్, నాయకులు పాతూరి రవి, చుండూరు శేఖర్‌బాబు పాల్గొన్నారు.

సర్వేలో ప్రజల సమస్యలు తెలపాలి

పెనమలూరు: వలంటీర్లు గ్రామాల్లో ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తున్న సమయంలో ప్రజలు సమస్యలు తెలపాలని పెనమలూరు మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలో గంగూరు - 2 సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. గ్రామాల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు రాకుండానే వారి సమస్యలు వెంటనే పరిష్కారం చేయటానికి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టిందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజల వద్దకే వచ్చి సమస్యలు యాప్‌లో నమోదు చేసి వారం రోజుల్లో సమస్యలు పరిష్కారం చేస్తారన్నారు. 103 మందికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీతా శర్మ, తహసీల్దార్ వెంకటశివయ్య, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరులో సర్వే..

ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నియోజకవర్గ కేంద్రం పెనమలూరు గ్రామంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి వివరాలు నమోదు చేశారు. పెనమలూరు గ్రామంలో ఈ నెల 10, 12, 14 తేదీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని ప్రజలు వారి సమస్యలు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

మెరుగైన సేవలే జగనన్న సురక్ష లక్ష్యం

కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తెన్నేరు సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. తెన్నేరు, మారేడుమాక గ్రామాల పరిధిలోని 590 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూలేని విధంగా పాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. అర్హులందరికీ పథకాలు అందిస్తూ, వారి సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తుందని చెప్పారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు స్థలాలు అందించటంతో పాటుగా ఇళ్ల నిర్మించే దిశగా పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటుందన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలని, కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జుజ్జవరపు ఎలీషా, సీహెచ్ ఆదర్శకుమార్, ఎంపీటీసీ శాంతి, తహసీల్దార్ పి.ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉదయ్‌భాస్కర్, ఈవోఆర్డీ పీవీఎస్ మైథిలి, కార్యదర్శి ఎం.సువర్ణ, వీఆర్వో సురేష్, పీఏసీఎస్ చైర్మన్ వీరంకి నరేష్, నాయకులు ఉప్పలూరి సునీల్, వీర్ల మోహనరావు, మట్టా నాగరాజు పాల్గొన్నారు.



తెన్నేరులో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి, అధికారులు



పోరంకిలో సర్టిఫికెట్ అందజేస్తున్న కమిషనర్ ప్రకాశరావు తదితరులు

జగనన్న సురక్షతో ప్రజల ముంగిటకే సేవలు

ఉయ్యూరు: జగనన్న సురక్షతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఉయ్యూరు ఆర్డీవో ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 4, 5 వార్డు సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో 144 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని), వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ పరిమి సలోమి, ఐదో వార్డు ఇన్‌చార్జి దిరిశం జ్యోతిర్మయి, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు పాల్గొన్నారు. కడవకొల్లు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 188 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఆర్డీవో విజయ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి జె.జ్యోతి, డీఎల్‌డీవో నాంచారరావు, ఎంపీడీవో విమాదేవి, తహసీల్దార్ మస్తాన్ పాల్గొన్నారు.



ఉయ్యూరులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్డీవో విజయ్‌కుమార్, చైర్మన్ వల్లభనేని నాని

జగనన్న సురక్షతో మెరుగైన సేవలు



ఊరులోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందుతాయని ఎప్పుడూ అనుకోలేదు. సచివాలయాలు వచ్చాక ఎంతో ఊరటగా ఉంది. జగనన్న సురక్షతో సేవలు మెరుగ్గా అందుతున్నాయి. సంతోషంగా ఉంది. ఈ ఏడాది నుంచి వైఎస్సార్ చేయూతకు అర్హత వచ్చింది. ప్రభుత్వం మహిళల ఆరోగ్య రక్షణ కోసం చేయూత అమలు చేస్తుంది. ఇందు కోసం కులం, నివాసం, ఆదాయం సర్టిఫికెట్ కావాలి. గతంలో నాకు ఎలాంటి సర్టిఫికెట్లు లేవు. ప్రస్తుతం జగనన్న సురక్ష ద్వారా సర్టిఫికెట్లు వచ్చాయి. చేయూతకు అర్హత ఉంది. దరఖాస్తు చేసుకుంటున్నా.

– వి.శివనాగమణి, స్థానికురాలు, తెన్నేరు

పులికుంట చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే వంశీ



గ్రామస్తులతో సమావేశమైన ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో ఉన్న పులికుంట చెరువును గురువారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరిశీలించారు. ఇటీవల పులికుంట చెరువు ఆక్రమణకు గురైనట్లు జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా చెరువు పరిస్థితిపై ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులతో ఆయన చర్చించారు. చెరువు భూమి ఎటువంటి ఆక్రమణలకు గురికాలేదని, కొంతమంది ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రామస్తులతో సమావేశమయ్యారు. పులికుంట చెరువు భూములను హైస్కూల్ నిర్మాణానికి, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువు భూముల సాగుదారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. సాగుదారులకు పూర్తి న్యాయం చేస్తామన్నారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు ఆంజనేయవరప్రసాద్ పాల్గొన్నారు.

మృతి చెందిన కౌలు రైతు కుటుంబానికి ఆర్థికసాయం

పెనమలూరు: యనమలకుదురులో విద్యుతాఘాతానికి మృతి చెందిన కౌలు రైతు వెలిశల కోటినాగులు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గురువారం పరామర్శించారు. ఎమ్మెల్యే గ్రామంలోని అంబేడ్కర్‌కాలనీలో బాధితుని ఇంటికి వెళ్లి మృతుడి భార్య నాగవేణి, కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్ బీమా నుంచి రూ.5 లక్షలు అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుడి కుమార్తె చదువుకు సాయం చేస్తానని, కుటుంబానికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెలగపూడి వరప్రసాద్, యార్లగడ్డ వీరబాబు, మరీదు శ్రీనివాసరావు, కోసూరి నరేష్ పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు

గన్నవరం: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలకు చెందిన క్లినికల్ కాంప్లెక్స్‌లో టీకాల కార్యక్రమాన్ని అసోసియేట్ డీన్ డాక్టర్ బి.శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల్లో రేబిస్ ప్రాణాంతకమైనదని చెప్పారు. ఈ వ్యాధి సోకకుండా పెంపుడు కుక్కలకు ముందస్తుగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని సూచించారు. మొత్తం 113 పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు వేసినట్లు క్లినికల్ కాంప్లెక్స్ విభాగాధిపతి డాక్టర్ కె.సురేష్‌కుమార్ తెలిపారు. డాక్టర్ ఎం. శ్రీనివాస్, డాక్టర్ ఎస్.లక్ష్మీరాణి, డాక్టర్ వి.దేవి ప్రసాద్, డాక్టర్ ఎస్‌వీవీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అల్లాపురంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు వేశారు. కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ కె.రాధాకృష్ణమూర్తి ప్రారంభించారు. అన్ని గ్రామీణ పశు వైద్యశాలల్లో ఈ నెల 20వ తేదీ వరకు రేబీస్ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశు వైద్యాధికారి డాక్టర్ జి.సుధీర్‌బాబు పాల్గొన్నారు.

యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌తో వ్యాధులు దూరం

ఉయ్యూరు: యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌తో పెంపుడు జంతువులకు వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని పశుసంవర్ధకశాఖ ఉయ్యూరు ఏడీ డాక్టర్ ఎం.రామశేఖర్ అన్నారు. జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశువైద్య కేంద్రంలో 320 పెంపుడు కుక్కలు, పిల్లులకు వ్యాక్సిన్లను గురువారం అందించారు. డాక్టర్ రామశేఖర్ మాట్లాడుతూ సకాలంలో వ్యాక్సిన్‌లు వేయించటం ద్వారా పెంపుడు జంతువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. రేబీస్ వ్యాక్సిన్‌తో పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులు నుంచి రక్షణ ఉంటుందన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఉంగుటూరు: సంక్రమిత వ్యాధుల నివారణకు పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని ఉంగుటూరు పశువైద్య అధికారి డాక్టర్ జి.స్వర్ణలత అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పశువైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు గురువారం వేశారు. ఈ సందర్భంగా సంక్రమిత వ్యాధుల నుంచి కుక్కలను రక్షించుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యాప్తంగా సుమారు 80 కుక్కలకు టీకాలు వేసినట్లు తెలిపారు. తేలప్రోలులో డాక్టర్ మల్లిబాబు, ఆత్కూరులో డాక్టర్ నాగార్జున, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు

గన్నవరంరూరల్: జంతు సంక్రమిత వ్యాధులతో అందరూ అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ జి.సుధీర్ బాబు తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా గురువారం గొల్లనపల్లి పశువైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు ఉచిత ర్యాబిస్ నిరోధక టీకాలను, జంతు సంక్రమిత వ్యాధి బ్రూసిల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను పెయ్యదూడలకు అందించారు. నాలుగు నుంచి 8 నెలలలోపు పెయ్యదూడలను ఈ వ్యాధి నుంచి రక్షించుకోవాలని పశు యజమానులకు సూచించారు. ఈ టీకాలు ముస్తాబాద పశువైద్యశాలలో, అన్ని గ్రామీణ పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, పెంపుడు కుక్కల, పెయ్య దూడల యజమానులు వినియోగించుకోవాలని చెప్పారు.

128 పెంపుడు కుక్కలకు టీకాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రపంచ జూనోసిస్ దినాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలంలోని పలు ప్రభుత్వ పశువైద్యశాలల్లో గురువారం పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను ఉచితంగా వేశారు. స్థానిక ఐటీఐ రోడ్డులోని ప్రభుత్వ పశువైద్యశాలలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ వై.మురళీధర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని బాపులపాడు, వీరవల్లి, కానుమోలు, రేమల్లె, అంపాపురం ప్రభుత్వ పశు వైద్యశాలల్లో 128 పెంపుడు కుక్కలకు టీకాలను ఉచితంగా వేసినట్లు చెప్పారు. శుక్రవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రేబిస్ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అసోసియేట్ డీన్ శ్రీదేవి



పెంపుడు పిల్లికి వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ రామశేఖర్

స్ఫూర్తి ప్రదాత బాబూజగ్జీవన్‌రామ్

ఉయ్యూరు: భావితరాలకు స్ఫూర్తి ప్రదాత బాబూజగ్జీవన్‌రామ్ అని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని అన్నారు. ఉయ్యూరు ఎస్సీకాలనీలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారత తొలి ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్ తెనాలి పద్మావతి, పార్టీ పట్టణ అధ్యక్షుడు జంపాన కొండలరావు, దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకుడు పినమాల నాగకుమార్, కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసు శ్రీనివాసరావు, నాయకులు ఎంజీ రవి, దిరిశం జ్యోతిర్మయి, దిరిశం ఇందిరా ప్రియదర్శిని, కొక్కిలిగడ్డ ప్రదీప్, కలకట్ల డాలీ పాల్గొన్నారు.

తేలప్రోలులో జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ఉంగుటూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని తేలప్రోలు సర్పంచ్ లాం దిబోరా అన్నారు. తేలప్రోలులో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక, రాజకీయ ఉద్యమాలను ఏకకాలంలో నడిపి వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందని అన్నారు. హరిత విప్లవానికి నాందిపలికి ఆహారోత్పత్తిని పెంపొందించారన్నారు. అనంతరం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వనాథపల్లి రవికుమార్, ఈపూరి కుమార్, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

పెనమలూరు: వణుకూరు గ్రామంలో బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతిని గురువారం చేశారు. గ్రామంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గ్రామ ఉపసర్పంచ్ గద్దల రాజా మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ సుదీర్ఘమైన తన రాజకీయ జీవితంలో దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. అట్టడుగు వర్గాలకు అందించిన సేవలతో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని తెలిపారు. నేటి యువత జగ్జీవన్‌రామ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉయ్యూరు ఎస్సీ కాలనీలో నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నానో ఎరువుల వినియోగంపై అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: నానో ఎరువుల వినియోగంతో రైతులకు పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గుతుందని ఇఫ్‌కో జనరల్ మేనేజర్ ఎం.జగన్‌మోహనరావు తెలిపారు. బాపులపాడు మండలం కొత్తపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రాంగణంలో నానో ఎరువుల వినియోగంపై ఇఫ్‌కో ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి హాజరైన ఇఫ్‌కో జనరల్ మేనేజర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ నానో ఎరువులు వ్యవసాయ రంగంలో సరికొత్త ఆవిష్కరణలని అన్నారు. నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు అర లీటరు మోతాదు ఒక ఎకరాకు సరిపోతుందని చెప్పారు. ఒక లీటరు నీటికి 4 ఎంఎల్ నానో యూరియా లేదా నానో డీఏపీ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఇఫ్‌కో ఏపీ మార్కెటింగ్ మేనేజర్ టి.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా రైతాంగం కోసం ఇఫ్‌కో ఆధ్వర్యంలో 10 డ్రోన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కొత్తపల్లి పీఏసీఎస్ ద్వారా జీవీఎస్ స్ప్రేయర్లు రైతులకు ఉచితంగా వినియోగించుకునేందుకు వీలు కల్పించినట్లు తెలిపారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ షేక్ హసీనా బీ, పీఏసీఎస్ చైర్మన్ మద్దాల వెంకటరత్నం, డైరెక్టర్ గురువెల్లి రమణ, ఇఫ్‌కో జిల్లా మేనేజర్ నందకిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న మహిళా మార్ట్‌తో సుస్థిర ఉపాధి

ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు


మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న మహిళా మార్ట్‌తో మహిళలకు సుస్థిర ఉపాధి లభిస్తుందని, ప్రతీ మహిళ జగనన్న మహిళా మార్ట్‌తో ఆర్థిక స్వావలంభన సాధించాలని ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. ఐవీ ప్యాలెస్‌లో గురువారం నగరపాలకసంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యాన మహిళలకు సుస్థిర జీవనోపాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆసరా, చేయూత వంటి పథకాలతో పాటు జగనన్న మహిళా మార్ట్ మహిళల జీవితాలలో నూతన వెలుగులు ప్రసరింప చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ సేవలను సద్వియోగం చేసుకోవాలని మెప్మా ఎండీ విజయలక్ష్మి, ప్రాజెక్టు ఆఫీసర్ శకుంతల కోరారు.

కంకిపాడులో కుండపోత వర్షం



కంకిపాడు: రుతుపవనాల ప్రభావంతో రెండు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమైంది. కారుమబ్బులు కమ్మేసి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు వర్షం కురిసింది. రహదారి మార్గం కూడా కనిపించని విధంగా వర్షం పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కంకిపాడు బైపాస్ మార్గం వెంబడి అండర్‌పాస్‌లు, గోసాల సెంటర్, కంకిపాడు బస్టాండు సెంటర్, రైతు బజారు మెయిన్ సెంటరులో రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయి చిన్నపాటి చెరువులను తలపించాయి. వర్షం కారణంగా పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లలో మురుగు రోడ్లపైకి చేరింది.

వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సాంబశివరావు



కంకిపాడు: వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలోని గొడవర్రు జెడ్పీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు తోట సాంబశివరావు నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నియామకం చేపట్టారు. గురువారం తోట సాంబశివరావు కంకిపాడులో విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించానన్నారు. తాజా కమిటీలో రాష్ట్ర కార్యదర్శిగా నియమించటం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి విప్లవాత్మక విధానాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నూతన సంస్కరణలతో విద్యార్థులకు మెరుగైన విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యాభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి పాటుపడతామని చెప్పారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఎంపీ విజయసాయిరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.జాలిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

- **మొగల్రాజపురం (విజయవాడతూర్పు):** దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న 90 మంది కానిస్టేబుళ్లకు రెయిన్ కోట్స్ అందజేశారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆదేశాల మేరకు గురువారం గుణదలలోని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. రిజ్వాన్, నాయకులు గల్లా రవి వీటిని పోలీసులకు అందించారు.